# (అవి) నీతి కథ

[స్నేహ మాసపత్రిక]

ఆలోచనలు అపమార్గం పడితే,

అనుభవం విషాదం అవుతుందా ?

నీతి కథలమధ్య

ఓ అవినీతి కథా జీవితం !....

'అయితే, నన్నేం చేయమంటారు బాబూ !'

మంచంమీద కూర్చున్న చక్రపాణి తలెత్తి చూశాడు. అప్పటికే అతని ఒడలంతా చెమట పట్టింది. మాట్లాడదామంటే గొంతు పెగలటం లేదు. కాని తనలోని కంగారు బయటకు కనబడనీయకుండా వుండటానికి శత విధాలాయత్నం చేశాడు. లక్ష్మి నరసువైపు కొంత సేపు తదేకంగా చూశాడు.

ఆమె చీరకొంగు నోట్లో పెట్టుకొని కాలి బొటన వేలితో నేలమీద రాస్తోంది. రెండు నిమిషాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం !

'ఇది నిజమేనా ?' అన్నాడు మెల్లగా.

'నిజమే బాబూ!' అనలేదు లక్ష్మి నరసు. ఆ అర్థం వచ్చేలా మెల్లగా తలూపింది. ఆమె నోటితో చెప్పాల్సినదంతా అయిదు నిమిషాల క్రితమే చెప్పేసింది. 'ఇంత మాత్రానికేనా !' ఎటో చూస్తున్నట్లు ముఖం పెట్టి అడిగాడు. అడిగిన అర నిమిషం తర్వాత తాను అడిగింది ఎంత తప్పుప్రశ్నో అవగతమయింది. లక్ష్మి నరసు సమాధానం చెప్పకుండా తీవ్రంగా చూసి తల దించుకుంది. ఆమె కన్నుల్లో నీళ్ళు లేవు. ముఖంలో దైన్యం లేదు. ఈ పరిస్థితికి తాను చలించినంతగా ఆమె చలించ లేదన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

కాని, ఈ వ్యవహారం ఇలా తయారయినందులకు నిజానికి తనకంటె ఆమె ఎక్కువగా గాభరా పడాలి. కాని, ఆమె ఇసుమంతయినా గాభరా చెందటంలేదు. నిలకడమీద తనకు కావల్సిన దాన్ని సాధించుకునేలా విశ్వాసంతో — ఓరగా వున్న తలుపుకు చేరగిలబడి నిలబడివుంది.

తలతిప్పి కిటికీలోంచి అవతలకు చూశాడు చక్రపాణి.

రోడ్డు దాదాపు నిర్మానుష్యంగా వుంది. తీవ్రమయిన ఎండకు భయపడి రోడ్డుమీదకు ఎవ్వరూ వచ్చినట్లు లేదు. దూరాన వున్న నూనెమిల్లు కూతకూసింది రెండుగంటల 'షిఫ్టు' ప్రారంభ సూచకంగా !

చక్రపాణి మళ్ళీ లక్ష్మీనరసువైపు చూశాడు : ఇంకా ఆమె అలాగే నిలబడివుంది. ఆమె అక్కడ అలా నిలబడి వుండటం చూస్తే ఏవరికయినా అనుమానం కలిగే అవకాశం వుంది. జరిగిన దానికే మతిపోయి ఏడుస్తూవుంటే, మళ్ళీ కొత్తగా అనుమానానికి తావివ్వటం తెలివయిన పనిగా కనుపించలేదు.

"తలుపు దగ్గరగా వేసి లోనికి రా!" అన్నాడు.

"పట్టపగలే!" అంది లక్ష్మీనరసు ఇటూ అటూ అనుమానంగా చూస్తూ, చక్రపాణికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు! "నువ్వు అలా తలుపు దగ్గర నిలబడితే ఎవరయినా చూస్తారు. తలుపు మూసి ఇలా వారగా వచ్చెయ్!" చికాకుగా అన్నాడు. ఆమె తలుపుమూసి లోనికి వచ్చి ఒక మూలకు నిలబడింది.

రెండు నిమిషాల తరువాత మళ్ళీ అడిగింది. "నన్నేంచేయ మంటారు బాబూ?"

"అదిగో, ఆ ఫ్లాస్కు తీసుకెళ్ళి వసంతవిహార్‌లో రెండు కాఫీలు పోయించుకురా! నాకాతాలో రాసుకొమ్మని చెప్పు!" అన్నాడు.

"అదికాదు బాబూ...."

"నన్ను కొంచెం ఆలోచించుకోనీయ్. ముందు నువెళ్ళి కాఫీ తీసుకురా!" చిరాగ్గా ముఖంపెట్టి అన్నాడు. లక్ష్మీనరసు మరి మాట్లాడ కుండా ఫ్లాస్కునుకుని వెళ్ళిపోయింది. చక్రపాణి సిగరెట్టు ముట్టించాడు. లక్ష్మీనరసు వ్యవహారం ఇపుడు వెలక్కాయలా గొంతు కడ్డంపడుతోంది.

ఇలా అవుతుందని తను కలలో కూడా ఊహించలేదు. ఈ పరిస్థితికి తనకు భయం కలుగుతోంది. కాని, భయపడి లాభంలేదు! సమస్యను పరిష్కరించాలే తప్ప బెంబేలు పడి ప్రయోజనం లేదు. తన అధైర్యాన్ని లక్ష్మీనరుసు గుర్తిస్తే మరీ ప్రమాదం! సిగరెట్టు దమ్ము గట్టిగాపీల్చి కిటికీవద్దకు వచ్చేడు.

కిటికీలోంచి వేడిగాలి గదిలోకి వస్తోంది. రోడ్డు అవతల రావి చెట్టుమీద కాకులు గుంపుగా చేరి గోలచేస్తున్నాయి.

లక్ష్మీనరుసుతో ఈ వ్యవహారం చాలో చిత్రంగా జరిగింది. చక్రపాణి ఈ వీధివైపు గదిలో అద్దెకు దిగి ఆరు నెలలు అయింది. ఇంటిగలవాళ్ళతో ప్రమేయం లేకుండా విడిగా వుంటుంది ఈ గది. యూనివర్సిటీకి దగ్గరగా వుంటుందని అద్దె హెచ్చయినా ఈ గది అద్దెకు తీసుకున్నాడు. ఈ ఏడాది ఎమ్మే ఫైనల్ రాయాలి. హాస్టలులో వుంటే చదువు జరగదని ఇక్కడకు మారేడు. ఈ ఇంటిగలాయనకు ఓ కూతురుంది. ఆమె పేరు శారద. లేడీస్ కాలేజీలో బియ్యే ఫైనల్ చదువుతోంది. గదిలో దిగిన వారం రోజుల్లోనే శారదతో నేస్తం కట్టేడు చక్రపాణి. శారద చాలా అందంగా, నాజూకుగా వుంటుంది. ఎక్కువగా మాట్లాడకుండా తలవంచుకుపోయే తత్త్వం ఆమెది. చక్రపాణి దగ్గరకు తరచు పుస్తకాల కోసం వచ్చేది. అలా ప్రారంభమయిన పరిచయం మొగ్గలు తొడిగి ప్రేమగా మారింది. తరువాత, శారద తల్లీ తండ్రీ నిద్రపోయాక పిల్లిలా అడుగులు వేసుకుంటూ గదిలోకి రావటం, చక్రపాణి దీపం ఆర్పేసి ఏ గంట తరువాతో శారదను తిరిగి ఇంట్లోకి పంపటం మామూలయిపోయింది. చక్రపాణి ఆమెను వివాహం చేసుకోవటానికే నిశ్చయించుకున్నాడు. ఆమెను మోసంచేసి పారిపోయే ప్రసక్తి గురించి ఏ నాడూ తలంచలేదు. కాకపోతే, ఎమ్మే అయ్యాక ఉద్యోగం సంపాదించుకొనే వరకు మాత్రం ఆగాలని అనుకున్నాడు. అందుకే ఈ విషయాన్ని ఇద్దరూ అతిరహస్యంగా వుంచేరు. అయితే, రెండు నెలలక్రితం ఓ రాత్రి చిన్న తిరకాసు జరిగింది. ఆ రాత్రి పదిగంటల సమయంలో, చక్రపాణి తన గదిలోని దీపం ఆర్పి గది తలుపులు ఓరగా వేసి శారద కోసం ఎదురు

చూస్తూ నిలుచున్నాడు. ప్రోగ్రాం ప్రకారం ఇంటాయనా, భార్యా రెండో ఆట సినిమాకు వెళ్ళాలి. వాళ్ళు వెళ్ళకపోతే శారద కదిలి రావటం కుదరదు. కాని వాళ్ళిద్దరూ సినిమాకు వెళ్ళినట్లులేదు. ఇంట్లో ఇంకా అలికిడిగా వుంది. "ఇక ఈ దినం శారద రాదేమో?" అని నిరాశ చేసుకుని తలుపు మూసే సమయంలో గోడవార శబ్దమయింది. అడుగులో అడుగేసుకుని శారద మెల్లగా వస్తోంది. ఆమె తలుపు ప్రక్కకిరాగానే ఆమె చేయి అంది పుచ్చుకొని గభాలున లోపలకి లాగి ఆమె చేయి పుచ్చుకొని తలుపు గడియ పెట్టాడు.

"బాబూ" అన్న గొంతుకతో ఉలిక్కి పడ్డాడు.

ఆమె శారదకాదు! పని మనిషి లక్ష్మినరసు! అంట్లు తోమటం ఆలశ్యమయినట్లుంది. గదిలో లైటు వేశాడు.

సందేహంలేదు- ఆమె లక్ష్మినరసే! కాని ఆ పెద్ద పువ్వుల నైలాన్ చీర ఈమెకెలా వచ్చింది?"

"ఈ చీర ఎక్కడిది" అన్నాడు బొంగురిన గొంతుతో.

శారదమ్మగారు ఇచ్చేరు, చిరిగిపోయిందని!" చిన్నగా నవ్వుతూ చెప్పింది లక్ష్మినరసు. తను చేయిపట్టుకులాగి తలుపు మూసినందుకు అనవసరంగా గొడవ చేస్తుందేమో అనుకొన్న చక్రపాణికి ఆమె ముఖంలోని ప్రసన్నత చూసేసరికి ధైర్యం చిక్కింది. లక్ష్మినరసు మీద తనకు మోజులేదు. ఏదో సర్ది చెప్పి పంపించేద్దా మనుకునేలోగానే ఆమె లైటు ఆర్పేసింది. "నామీద ఇంత మోజుందని ఎప్పుడూ చెప్ప లేదేం బాబూ! అయినా, అలా చెయ్యిపట్టుకు లాగేరు కదా, ఎవరయినా చూస్తేనో" అంటూ దగ్గరగా వచ్చింది. "ఫర్వాలేదులే" అని మాత్రం అనగలిగేడు. షుమారు అరగంట తర్వాత ఆమెను బయటకు పంపేశాడు.

అంతే! ఆ తరువాత మరి ఎన్నడూ తనామెవేపు కన్నెత్తి చూడ లేదు. ఇంత కాలం ఆమెకూడా ఏం జరగనట్లే ప్రవర్తించింది. ముఖ్యంగా ఈ విషయం శారదకు తెలియకూడదు. తెలిస్తే తనను అసహ్యించు కుంటుంది. శారదను తాను వదులుకోలేడు! ఆమెను తాను పెళ్ళి చేసుకోవాలి. ఆమె లేని భవిష్యత్తును తాను ఊహించుకోవటంలేదు.

కాని, అరగంట క్రితం వచ్చిన లక్ష్మీనరసు బాంబుపేల్చింది.

కాళ్ళకు అడ్డం పడిన తీగ కాస్తా ఇప్పుడు మెడకు చుట్టుకొంది. ఈ తీగని శాశ్వతంగా తొలగిస్తే తప్ప ప్రయోజనం లేదు.

"నాకు నెల తప్పిందిబాబూ!" అన్న లక్ష్మీనరసు మాటలు చెవుల్లో సుడులు తిరుగుతున్నాయి! "మరి నన్నేం చేయమంటారు బాబూ!" అంటూ తరువాత బాధ్యతకూడా తన నెత్తిన వదేసింది, ఈ చికాకు తొలగాలంటే ఒక్కటే మార్గం! "లక్ష్మీనరసు శాశ్వతంగా తొలగిపోతే ఏ గొడవా వుండదు." ఈ ఆలోచన రాగానే చక్రపాణి మనసు గుబగుబ లాడింది. అంతలోనే ఫ్లాస్కుతో లక్ష్మీనరసు వచ్చింది.

"రెండు కప్పుల్లోపోసి నాకొకటిచ్చి నువ్వొకటి తీసుకో" అన్నాడు ఆమె కాఫీపోసి చక్రపాణికి కప్పు అందించింది.

"నీకో!" అన్నాడు.

"నాకు వద్దు బాబూ!" అంది. ఫ్లాస్కుమూత పెట్టి టేబుల్ మీద ఉంచేసింది. కాఫీ త్రాగటం ముగించి గొంతు సర్దుకొని అన్నాడు చక్రపాణి. "ఈ విషయం బయటకు పొక్కటం ఇద్దరికీ మంచిదికాదు. దీనికి ఒక్కటే మార్గం ఉంది. గర్భంపోవటానికి మందు తెచ్చిస్తాను. వేసుకుంటావా?"

అంగీకార సూచకంగా తలవూపింది.

"సరే! ఈ సాయంకాలం మందు తెస్తాను రాత్రికి వేసుకో! ఈ సంగతి మరెవ్వరికి తెలియనివ్వనని మాటివ్వాలి?"

"ఎవ్వరితోటి చెప్పను బాబూ! సత్తెప్రమాణంగా!" అంది.

"సరే నువ్వెళ్ళి మళ్ళీ సాయంకాలం రా!" అన్నాడు. లక్ష్మీనరసు వెళ్ళిపోయింది.

• • •

ఆ సాయంకాలం నిద్ర మాత్రలు పెద్దమోతాదులో సంపాదించి వాటిని గుండచేసి పొట్లం కట్టాడు చక్రపాణి. కనుచీకటి వడ్డాక లక్ష్మీనరసు వచ్చింది. వణికే చేతులతో, ఆమెకు ఆ పొట్లం అందించేడు. "నిద్ర పోయే ముందు అంతా ఒక్కసారి మింగెయ్! రేపు మళ్ళీ కనిపించు" అన్నాడు. ఆమె వెళ్ళిన వంకే చూస్తూ ఉండిపోయాడు చక్రపాణి.

• • •

తలుపు తట్టిన శబ్దంతో మెలకువ వచ్చింది చక్రపాణికి. లేచి వెళ్లి తలుపుతీశాడు. ఎదురుగా లక్ష్మీనరసు! దెయ్యాన్ని చూసినట్లు జడుసుకున్నాడు.

"గది ఊడుస్తాను బాబూ!" అంటూ చీపురు తీసుకొని లోనికి వచ్చింది.

కొంతసేపు నోటమాట రాక నిలిచిపోయేడు చక్రపాణి. తరువాత మెల్లగా అడిగేడు. "నిన్నరాత్రి మందు వేసుకోలేదా?" అతని కంఠంలో గాభరా తొంగి చూసింది.

లక్ష్మీనరసు సమాధానం చెప్పలేదు. అంతలో ఇంటిగలాయన గాభరాగా వచ్చి "బాబూ! శారద ఎంత లేపినా లేవటం లేదు. ఆమె నోట్లోంచి నురుగులు వస్తున్నాయి. నాకు చాలా భయంగా వుంది. నువ్వు పరుగున వెళ్ళి డాక్టరు మూర్తిగారిని తీసుకొస్తావా?" అన్నాడు.

చక్రపాణి "అలాగేనండీ" అంటూ హడావుడిగా చొక్కా వేసుకొన్నాడు. ఇంటాయన మళ్ళీ ఇంట్లోకి పరుగెత్తాడు.

చక్రపాణి చొక్కా గుండీలు పెట్టుకొంటూ పళ్ళుబిగబట్టి లక్ష్మీనరసు దగ్గరగా వెళ్లి అడిగాడు.

"చెప్పు! ఆ మందు ఏం చేశావ్?"

"శారదమ్మగారి కిచ్చేను."

"ఆఁ?"

"ఆ యమ్మకే నెలతప్పింది. ఇంట్లో తెలిస్తే చంపేస్తారని, నన్ను మందు తెమ్మంది. నాకు యాభయిరూపాయలిచ్చింది. అందుకని నింద నా మీద పెట్టుకుని ఋమ్మల్ని అడిగేను.

"మరి, నీకు...." సణుగుతున్నట్లు అడిగేడు.

"ఆహా!" ఈసడింపుగా చూసి, గది తుడవటం ఆరంభించింది లక్ష్మీనరసు.

"ఎంత పని చేశావే పాపిష్టిదానా!" అంటూ ఒక్క వుదుటున గదిదాటి డాక్టరు కోసం పరుగెత్తాడు చక్రపాణి.

సమాప్తం